# ప్లాట్‌ఫారమ్

కాలం విలువనందరూ ఒక్కసారే గుర్తించినట్లు ఉంది. ఓహ్! ఒహటేకేకలు, గోల, అల్లరి, గందరగోళం... దెబ్బలాటలు... కయ్యాలు... దబాయింపులు... పలుకరింపులు, అప్పగింతలు, హెచ్చరికలు.

దిగేవాళ్ళకు దిగకుండా రైలు వెళ్ళిపోతుందనీ, సామానుండిపోతుందనీ బెంగ... ఎక్కేవాళ్ళకు అసలు నిలబడేందుకైనా జాగా దొరకదేమోనని భయం!

అదీ ఇదీ గాకుండా లోపల తిష్ఠవేసుకు కూర్చున్న వాళ్ళకు... వాళ్ళ మేకపోతు గాంభీర్యాన్ని, ఏ తుంటరో, గడుగ్గాయో లేక కాస్త బందోబస్తయిన ముష్కరుడో, ఒక్క జబ్బ తలాయింపుతో ఎగరగొట్టి జాగా లక్కుంటాడేమోనని అనుమానం.

చల్లని సరుకూ, చెల్లని సరుకూ అన్నీ ఆవురావురనే రైలు ఇంజను కడుపుల్లాంటివి వున్న దాణాదాసులు లాగించేస్తారని అనుభవంమీది అలవాటుగనక అడ్డమైనవీ అమ్ముకుపోతున్నారు.

"అదో అక్కడ ఖాళీ వున్నట్లుంది."

"అయ్యో, అటు పోతారేమయ్యా! ఇటూ"...

"అక్కడబోగీ ఖాళీగా వుందంటే ఇలా ఎగబడతారేమ్?"

"ఉండవయ్యా! మహా ఎక్కావ్‌గదాని, సొంత ఇల్లు అనుకుంటున్నావ్!"

"బాబ్బాబూ! ఒక్క అంగుళం.. ఇదో ఆడవాళ్ళండీ చోటుచేద్దురూ!"

"ఎక్కవోయ్! దబాయించు! లేకపోతే బ్రతకలేమ్!" అని మామూలు ధోరణి కేకలటుంచి, కొన్ని చోట్ల చేతులు కలుపుతున్నారు. కొన్నిచోట్ల "మాటలు తిన్నగా రానీ" మంటే "తిన్నగా వాగమని" వంకరగా వాగుతూ వాగ్యుద్ధాలు జరుపుతున్నారు.

అలాంటి సందర్భాల్లోనే ప్రాప్తకాలజ్ఞులు కోటలో పాగా వేయగలగడం.

శంకరం ఠపీమని బుర్ర దూర్చేసి తర్వాత తతిమ్మా నూటపాతిక పౌన్ల శరరాన్ని అరటన్ను బరువు నెట్టేందుకా అన్నంత శక్తి పూనా, వినియోగించి దూరిపోయాడు.

"ఏవండోయ్! మాస్టారూ! ఛీఛీ, పాడుముండా చదువులు. కళ్లు కనిపించవు! అయ్యో అయ్యో, తొక్కేస్తున్నారు. బూటుకాలితో కూడాను. ఇంతకీ నేను మనిషిలా అగుపిస్తున్నానా? అంట" ఒకమోతుబరి తన పెట్టెమీద మఠం వేసుకుని కూర్చుని అపరాధ భయంకర నవల నొక దాన్ని చేత బుచ్చుకుని గోలపెడుతున్నాడు.

అందులో తప్పులేదు. శంకరం బూటుకాలు అతని తొడమీదికి ఆకలిగొన్న బెబ్బులిలాగ లంఘించ నుంకిస్తున్నది.

పోనీ, అది అక్కడ పెట్టడం మానేసి, మరో దగ్గర దింపుదామా అంటే? ఏమో అది "క్రిందికి ' ఏ పెట్టె సందుకో ఫలాని ఇంత లోతు అని తెలీకుండా వెళ్ళి, మరి రాక పోవచ్చును.

వెళ్ళేదా గవర్నమెంటు ఉద్యోగమాయిరి. ఈ ఛాన్సు తప్పిందో, మళ్ళీసారికి పాతిక సంవత్సరాలు దాటిపోయి జీవితంలో మరి ప్రభుత్వ నౌకరీ "ఇంపాజిబుల్!"

"క్షణికమే అయినా ఆ త్రిశంకు 'నరకంలో'లో శంకరానికి ముచ్చెమటలు పోశాయి.

అంతలో ఎవరో అరడుగుల మంచాన్ని కాళ్లూ చేతులు కలియగట్టి అమాంతం కిటికీలోనుంచి తోసేశారు. అది డిటెక్టివ్‌పాఠకుడి తలమీదుగా, శంకరం తొడమీంచి దూసుకుని ఉపసంహరించుకోలేని పాషాణాస్త్రంలాగ వెళ్ళిపోయింది.

శంకరం బూటు కాలుతో పాటు అతని రిస్టువాచీ చెయ్యి సైతం ఆ మోతుబరి తల ఆసరా చేసుకుంది.

ఆ వ్యక్తి అవకాశం ఉంటే ఎంత కేకలు వేసునోగాని, కిక్కురమనడానికి వీలుచిక్కలేదు.

విశ్వం ఇవతలనుంచి, కాస్త తలవంచి కిటికీలోనుంచి, తన స్నేహితుడి శాల్తీ ఏమాత్రం దక్కుతుందో చూద్దామను కొనేటంతలో మంచం విడుదలచేసి నతగాడు అదే మార్గంలో ఒక నెట్టుతో విశ్వం తలకాయను విసిరి, లోపలికి రివ్వున దూసుకున్నాడు.

విశ్వం తలకాయ ఠపీమని రైలుపెట్టె కేసి కొట్టుకుంది. లోపల హాహాకారాలు లీలగా వినిపించాయి. కళ్ళంట నీళ్ళు తిరిగాయి. అవి ఆపుకుని నాలిక చివరిదాకా వచ్చిన అడ్డమైన తిట్లనూ అత్యంత ప్రయత్నంమీద ఉపసంహరించుకుని, తిరిగీ తన మిత్రుడు శంకరం దురవస్థ చూడ్డానికి తలపడేసరికి రైలు ఝుకఝుకమని కదిలిపోయింది.

ఆ పక్క ఆడవాళ్ళ పెట్టెలోని ద్వంద్వయుద్ధం క్షణంలో మెరిసి వెళ్ళిపోయింది.

విశ్వం వెళ్ళిపోయే ఇంజను కేసి చూడబోయేసరికి ఎలా వీలుచిక్కిందో ఏమో, శంకరం బుర్ర ఇవతలికి పెట్టి చెయ్యి తెగ ఊపుతున్నాడు. ఒక చేత్తో తల తడుముకుంటూ, రెండో చెయ్యి సోలిపోయే

పావురాయి రెక్కలాగ ఊపాడు విశ్వం.

వెళ్ళిపోయాడు శంకరం.

విశ్వంలో ఏదో వెలితి కనిపించింది. అది ఆకలికాదు; దాహంకాదు. అలాంటిదే అదోమాదిరి వెలితి. శంకరం ఉదయం వచ్చాడు. ఇపుడు వెళ్ళి పోయాడు. అయితే అతని ఎడబాటు బరువుగా వుంది.

ఆ మాటకొస్తే విశ్వానికి ఈ అనుభూతి ఇదే మొదటిసారి గాదు. సూర్యం వచ్చాడు పోయిన నెల. రాఘవుడు పోయిన వారం వెళ్ళిపోయాడు. కృష్ణ టెలిగ్రాం యిచ్చి స్టేషన్లో ఊపిరి సలపకుండాకబుర్లుచెప్పి ఢిల్లీ వెళ్ళిపోయాడు.

ఏడాది క్రితం వీళ్ళంతా తనకెంత సన్నిహితులు! ? మూడేళ్ళ క్రితం వీళ్ళంతా తనకెంత అపరిచితులు!

రెండేళ్ళు కలిసి మెలిసి మెలిగి విడిపోయారు. తలో రైలూ ఎక్కి తలో ఊరూ చేరుకున్నారు.

విశ్వం కొంచెం బాధపడ్డాడు. ఇదివరకు విశ్వం కొంచెం గర్వపడేవాడు. తన ఊరు అయిదు రైలుమార్గాల కూడలి అని. తనకు కాలేజీలో ఎంతో మిత్రబృందముందనీ....

విశ్వం తనేం చేద్దామూ, ఏమవుదామూ, అని ఆలోచించుకునే లోపునే అతని స్నేహితులలో సగంమందిని ఇంకా ఎక్కువమందినే ఇదే ప్లాట్‌ఫారంమీంచి రకరకాల జీవితాల్లోకి సాగనంపేశాడు.

ఆ ప్లాట్‌ఫారంమీద అన్ని వేపులకు వెళ్ళే రైళ్ళూ ఆగుతాయి. అందులో ప్రతివేపూ ప్రతిసారీ గాకపోయినా ఒక్కోసారి ఒక్కోవేపు తన స్నేహితులను దిగబెట్టాడు విశ్వం.

కృష్ణ తనతో టెన్నిస్ ఆడుకున్నాడు. తననెప్పుడూ "ఒకనాడు ఛాంపియన్‌వి అవుతావ్" అని మెచ్చుకొనేవాడు. కాని ఆ కృష్ణని తనే టెన్నిస్ చాంపియన్‌షిప్ విన్నర్ అయిర్మమ్మని ఇదే ప్లాట్‌పారంమీద రైలెక్కించాడు.

సూర్యం అనేవాడు "నీకున్నంత మంచి 'ఎక్స్‌ప్రెషన్' మాకుందా? నువ్వు మంచి లెక్చరర్‌వి అవుతావురా!" అని. వాడు తన ఇంట నాలుగు రోజులుండి మరీ వెళ్లి బెంగుళూరులో లెక్చరర్ అయ్యాడు.

విశ్వం దగ్గర ఏదోవిధంగా సలహాలు అడిగి స్వీకరించని వాళ్ళంటూ లేరు. అతనికి ఎవరూ సలహా యివ్వలేక పోయారు!

"నువ్వా! నీకేది కావాలంటే అదే అవుతావ్" అన్నాడు మోహన్.

ఏదో వైపునుంచి ఏదో ఇంటర్వ్యూకనీ లేదా ఉద్యోగానికని వెళ్ళే స్నేహితులు విశ్వంమీద ఉత్తరాలు , టెలిగ్రాములు దాడి చేయిస్తారు.

అటుతర్వాత కృతజ్ఞతలు వర్షిస్తూ రైలు కిటికీలోనుంచి చెయ్యి ఊపుతూ వెళ్ళిపోతారు.

వీళ్ళందరికీ ఎవడిచ్చాడీ హక్కు! చివరికి తన ప్రాణంలో ప్రాణంలాంటి శంకరం కూడా యివాళ వెళ్ళిపోయాడు.

"ఒరేయ్! విశ్వం మనందర్నీ బీట్‌చేసి ఉద్యోగం చేస్తాడ్రా" అనేవాడు శంకరం.

"వాడు ముందు మ్యారేజ్ చేసుకుని మనకు మార్గదర్శకుడవుతాడ్రా!" అని మోహన్ సిన్సియర్‌గా అనేవాడు.

విశ్వానికి అనుమానాలు వచ్చేవి. అవి ఇవాళ శతవిధాల నిజ మవుతున్నాయి.

"అన్నీ ఔతానంటారే! చివరికి నేనేమౌతాను?"

విశ్వంలో ఉన్న విశేషమేవిఁటి అంటే అన్ని రకాల అభిరుచులు ఉన్నవాళ్ళకూ అతనిలో ఒక విశిష్టత గోచరిచండం! ఏదో రకంగా ఆ యావ్యక్తుల తత్వాన్నీ అతడు భరించగలగడం!

తన అసంతృప్తికి అర్థంలేదని విశ్వం విశ్వాసం. అయినా అది తీరడంలేదు. "వాళ్ళల్లో ఏ ఒక్కడూ విశ్వానికి తృప్తి ఇవ్వకపోగా, అందరూ అదౌతావు; ఇదౌతావు అని "అవి" "యివీ" లాక్కున్నారు' 'అనుకున్నాడు విశ్వం.

దేశంలో ఎన్ని రకాల ఉద్యోగాలున్నాయో అన్ని రకాల స్నేహితులున్నారు తనకు.

అయితేనేం, అందరూ ఆ ప్లాట్‌ఫారంకేసి చెయ్యి ఊపి పోయినవాళ్ళే!

ఇదేనా స్నేహం! ఇదా మైత్రి? రైలు బళ్ళలాగ ఆగడం... పోవడం. వెధవలు! తన బాధ వాళ్ళకు అక్కర్లేదు. తనా ప్లాట్‌ఫారంలాగ పడి ఉండాల్సిందే!

విశ్వం అదోమాదిరిగా నవ్వుకున్నాడు. అది నవ్వు గాదు. అలాగ కనిపిస్తుంది. అది వేదాంతం! ఏదో మహత్తర సత్యాన్ని గ్రహించానన్న గర్వం!

విశ్వాని కదీ తృప్తినివ్వలేదు. తనూ ఈ ప్లాట్‌ఫారం బ్రతుకు మానేసి అదో ఆ శంకరంలాగే చెయ్యి ఊపేసి ఈ ప్లాట్‌ఫారానికి వెళ్ళిపోవాలనుంది.

కాని ఎక్కడికి? తనకేమీ రుచించదు. అందరికీ అన్ని సలహాలనిచ్చిన తను... తనకు ఒక్క నిర్ణయం చేసుకోలేడు.

తను ఉద్యోగానికి అప్లయి చెయ్యలేదుగదా! పోనీ మళ్ళీ చదువుకుంటే! అంతకంటే తనకు సులువైనది ఏమిటి?

డబ్బుండాలిగాని చదువుకోడానికి చదువులు కొదువా?

ఈ వెలితి తీరదు చదువుచేత. ఇదంతా దానివల్లనే కలిగింది. ఇంతమంది ఈ విధంగాగుండెలు దొలిచి పోయారు.

కొత్తస్నేహితులొస్తారు. నిజమే! తను తాత్కాలికంగా పాతవాళ్ళను మరచిపోతాడు.

మళ్ళీ పాత కొత్తదవకపోగా, కొత్త పాతదై ఇదేకథ మొదటికొస్తుంది!

విశ్వానికి విసుగు వచ్చింది. ఇంటికి వెళ్ళబుద్ధి వేసింది కాదు.

ఒకవేళ ఇంటికి వెళ్ళినా ఇవి "ఇంటర్వ్యూ" రోజులు.

మరో వెంకడు ఎవరో "నేను రాత్రి రెండు గంటల రైల్లో ఫలాని ఇంటర్వ్యూకి పోతున్నా. నువ్వు రాకపోతే ఒట్టు" అనే అర్థంలో టెలిగ్రాం ఇచ్చే ఉంటాడు.

ప్లాట్‌ఫారంమీద హోటల్‌లో దొరికే నదాంతో ఒక రకమైన ఆకలి తీరింది.

మరో రకమయిన వెలితి నిండిందికాదు.

వసంతకూడా యిలాగే ఒకనాడు తిరిగివచ్చి చెయ్యి ఊపేసి వెళ్ళిపోతుందా?

ఏమో, యిక్కడే ఉండిపోతుందేమో! అలాగయితే ఎంత బాగుడును!

అయినా వసంత ఎంత మోసం చేసింది తనను?

వసంత విశ్వం క్లాసమేటు. ఆమె ప్రతి కదలికా ఒక మధురమైన రాగాలాపనలాగ తోచేదా రోజుల్లో. ఆమె మాట ప్రతీదీ పారిజాతాల జడివానై తన ఎదను కురిసేది. ఆమె చెలిమి కోరడమే ఒక తపోనిష్ఠగా ఉండేది.

వసంతకి కూడా విశ్వం అంటే ఎంతో యిది ఉండేది.

"ఇది" అంటే ప్రేమా? అనురాగమా? ఆపేక్షా? గురియా? గౌరవమా? జాలియా? ఏవిఁటో తెలీదు. ఆ పిల్ల అతడికేసి మంత్రముగ్ధలాగ చూసేది. కాని చనువు యిచ్చేది కాదు. చుట్టూ జైలు కటకటాలున్నట్టూ మాట్లాడేది. ఎవరిదో అధికార హస్తం ఆమె నోరు నొక్కుతున్నట్లు సమాధానాలిచ్చేది.

విశ్వంలోని ఏదో ఆకర్షణ తనను అయస్కాంతలాగ లాగుతున్నదే గాని తనకై తాను ఎంతమాత్రం అతడిని చేరను అన్నట్లు ప్రవర్తించేది.

విశ్వానికి కోపం వచ్చేది. దుఃఖమూ వచ్చేది. కాని వసంత కళ్ళల్లో ఏమీ చదవడం సాధ్యపడేదికాదు.

అందిన పండులాగ అగుపించుతూ చెయ్యి చాస్తే చాలు, అరంగుళం దూరం కదిలిపోయే "మాయ" లా, "మహిమ"లాగ రెండు సంవత్సరాలు తనను వెర్రి వెంగళప్పలాగ ఆడించి వెళ్ళిపోయింది వసంత!

ఒకే ప్లాట్‌ఫారం మీద రెండు రైళ్ళు ఎక్కి ఒకరివేపు ఒకరు ఉదయ సాయం సంధ్యల్లాగ బరువెక్కిన వదనాలతో చూసుకుంటూ విడిపోయారు.

"మరో ప్లాట్‌ఫారంమీద కలుస్తా" నంది తనతో వసంత.

విశ్వానికి ఇప్పుడు ఆమాటగురించే కోపం వచ్చింది. కాని అతనికి కొంత నమ్మకమున్నది ఆ

మాటమీద . అదే అతనికి ప్రాణం కూడాను.

ఇంతమందిని కలిపే ప్లాట్‌ఫారమ్... తన వసంతనుకూడా తనవద్దకు తీసుకుని రారాదా?

ఇంతకూ వసంత తనను మోసం చేసిందా? విశ్వానికి ఒళ్ళు మండిపోయింది.

నిండైన కళ్ళతో, కన్నీళ్ళతో ఒక్క వాక్యంలో తేల్చేసింది వసంత.

"మిమ్మల్ని... మిమ్మల్నిమోసం చేశాను. మీకు ఫస్టుక్లాసు నామూలాన రాదేమోనని... ఆ వేళనుంచీ యిప్పటిదాకా నా ఈ మంగళసూత్రాన్ని దాచేశాను."

పరీక్షలైపోయి పుస్తకాలను అవతల గిరగిరా తిప్పి విసిరేసి, పరిగెత్తుకుని పట్టరాని ఆనందంతో తను వెడితే వసంత ఏం చేసింది?

నాలుగేళ్ళ క్రితం తనకు ఎవరోకట్టిన మంగళసూత్రం చూపించింది.

"దుర్మార్గురాలు"-తనేం చేసుకున్నాడు ఈవేళ తన ఫస్టుక్లాసును?

విశ్వం లేచి గబగబ నడక సాగించాడు. వసంతమీద కోపం అతనికి ఎక్కడలేని సత్తువనూ ఇచ్చింది.

ఠక్కున ఆగిపోయాడు. అయినా వసంతదేం తప్పు? పెళ్ళయిన తర్వాత చదువుకోవడమా? తనను ప్రేమించడమా? ఏది దోషం?

ఆమాటకొస్తే వసంత తనమీద జాలిపడ్డదేమో! తను ఒక ఇంద్రజాలికుడు! తనే మోసగాడు! తను మంత్రగాడు! తనే మోహపిపాసాపీడితుడు! తనే స్వార్థపరుడు! వసంత అమాయక మైనది. తామరాకుమీద మంచుబిందువులాంటిది...

విశ్వానికి అసహ్యం వేసింది తనమీద తనకు! అసలు తనకు ప్రేమించడం తెలియదన్న భయం వేసింది.

అయినా వీళ్ళందరినీ వదలలేని తను, వసంతను వదలగలగడం అసంభవం అనిపించింది. "ఇంకో ప్లాట్‌ఫారంమీద కలుద్దాం"అంది వసంత. అది ఇదే అవకూడదూ? వసంత కూడా ఏ ఇంటర్వ్యూకో, ఉద్యోగానికో, టూర్‌మీదో ఇలా వెళ్ళరాదూ!

విశ్వం ఇంటికి వచ్చాడు. ఇల్లూ ప్లాట్‌ఫారం అన్నీ ఒక్కలాగే ఉన్నాయి తనకు.

"ప్రతీవాడూ పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చేవాడే! వెధవది వీళ్ళకేం తెలుసు! ఒకవేళ కొన్నాళ్ళకి వసంత వస్తే! తను ప్లాట్‌ఫారంమీద తన ఇల్లాలితో చెయ్యి ఊపుతూ నుంచుంటే ఏమనుకుంటుంది?

అయితే మరి వసంత పెళ్లాడింది కాదా? అది వేరు. వసంత ఆడపిల్ల! తన ఇష్టం లేదేమో ఆపెళ్లికి. అదీగాక ఆ పిల్ల పెళ్ళయిన తర్వాత తను ఆమెను ప్రేమించాడు. అందుచేత ఆమె తప్పు ఏమీలేదు. విశ్వం బెంగపడ్డాడు కుర్చీలో కూలబడుతూ.

ఒకనాడు వసంత వస్తానని టెలిగ్రాం ఇచ్చేసరికి అంతలో తను నాలుగురాళ్ళూ అవగొట్టుకుని..

ఉత్తబికారివాడైపోడుకదా?

వెంటనే లేచి టేబుల్ లాంపు వెలిగించి, జేబులోని పర్సు తీసి డ్రాయరులో పెట్టి, సొరుగు తాళం వేసి ముమ్మారు లాగి చూశాడు.

"అమ్మయ్య" అనుకున్నాడు.

కొంచెం ధైర్యంగా కుర్చీలో కూలబడ్డాడు..... నిట్టూర్చాడు. అంతలో

"సార్! టెలిగ్రాం!"

విశ్వం ఉలికిపడ్డాడు. వసంత దగ్గర్నుంచి కాదుగదా?

ఛీఛీ! ఎవడో వెధవ! ఏ.ఐ.ఏ.ఎస్.కో వెడుతూ అయ్యుంటుంది.

"ఒక అరగంట అయ్యిందాకా అది విప్పి చదవకూడదు. పోతే పోతాడు. ఎంతకన్నా" అనుకున్నాడు.

ప్రతీ వెధవా తన గుండెల్లో రక్తాన్ని గుంజుకు పోయేవాడే!

విశ్వం అలవాటుపడ్డ చేతులు చకచకా టెలిగ్రాం విప్పి కళ్ళముందుంచడంతో చదవక తప్పిందికాదు.

అతని కళ్లు పచ్చబారిపోయాయి! కుర్చీకి ఒక్క క్షణం అతుక్కుపోయాడు! త్రుళ్ళిపడి "వీల్లేదు' 'అ న్నాడు గట్టిగా.

"నేనిందుకేనా? ఈ ప్లాట్‌ఫారంమీద యిలా పడిగాపులు పడుతూంటా" అని సొరుగు లాగి పర్సు జేబులో వేసుకుని తక్షణం వీధిలో పడ్డాడు.

వసంతకు సీరియస్‌గా ఉందా? రెండేళ్ళ తర్వాత ఇదా టెలిగ్రాం! ఇన్నాళ్ళు కులాసాగా ఉన్నన్నాళ్ళు ఒక్క అక్షరం ముక్క లేదే! తన వసంతకు సీరియస్‌గా వుందా?...

విశ్వానికి ఒళ్ళు మరిగిపోయంది. దైవాన్ని తిట్టాడు. అలా తిట్టడంలో అతనికి పంచేంద్రియాల బలం చాలిందికాదు.

కదిలే రైలెక్కాడు. ఏది ఏమయినా "వసంతను చావనివ్వను" అనుకున్నాడు.

"ఈ ప్లాట్‌ఫారం వదిలేస్తాను. వసంత దగ్గరే వుండిపోతా! వసంతను బ్రతికించుకుంటా" అనుకున్నాడు. రైలెక్కుతూ చెయ్యిఊపాడు.

ప్లాట్‌ఫారంకేసి..... మరి రాను అన్నట్లు తృప్తిగా నవ్వబోయాడు.

ఆశ్చర్యం! తనను తాను నమ్మలేకపోయాడు. ఆ ప్లాట్‌ఫారం మీద తనే నించున్నాడు. తనకేసి తనే చెయ్యి ఊపుతున్నాడు.

అంతేకాదు, ఆ ప్లాట్‌ఫారం తనతోనే వచ్చేస్తోంది...... తనవెంటే వస్తోంది...

విశ్వంలోని శక్తి విశ్వరూపం ధరించింది.

"వెధవ ప్లాట్‌ఫారమ్! దీన్నినెట్టేస్తా!" అనుకున్నాడు.

రైలు వెళ్ళిపోతోంది. ప్లాట్‌ఫారం తనలోనికి వస్తానంటోంది. అంతే! అతనికి స్పృహ తప్పిపోయింది.

రైలు చైను లాగారు ఎవరో. "అయ్యో! కదిలేరైలు ఎక్కొద్దూ అంటే వినరుగదా"...

"ఎవరో గొప్పవాడిలాగే ఉన్నాడు"...

"పాపం! ప్చ్ ప్చ్! ఎంత అందం చిందుతోంది. ఆ మొహంలో!"

స్పృహ తప్పిన విశ్వానికి మళ్ళీ నాలుగు రోజులదాకా కాలం స్థంభించిపోయింది.

అతనుకళ్ళు విప్పి చూస్తే ఎదురుగా నర్సు! వసంత లాగ కనిపించిందామె.

"వసంతా!" అన్నాడు నూతిలో గొంతుకవుంది! నర్సు కళ్ళవెంట రెండునిర్మలమైన మంచుబిందువుల్లాంటి కన్నీటి బిందువులు చెంపలమీదుగా జారిపోయాయి.

ఆమె వెనుతిరిగి వెళ్ళిపోయింది. నర్సూ, డాక్టరూ గుసగుసలాడి "వసంత ఇహలోక యాత్ర చాలించిం"దన్న వార్త తెచ్చిన కాగితం ముక్కను చింపేశారు.

వాళ్ళ విశ్వాసం... దానితో అతని ఇహలోక యాత్ర పొడిగించామనీ..... ఒక ప్రాణదానం చేశామనీను- నిజమా?....

(1958, ఆంధ్రపత్రిక వార పత్రిక)